క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు


పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: మండలంలో ఎ.ఆర్.పేట పంచాయతీ పుష్పగిరిలో ప్రసిద్ధి చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా విశిష్ట పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఫణిహారం సీతరామచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. అదేవిధంగా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి


నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సూపర్‌వైజర్ అపర్ణరాణి

దత్తిరాజేరు: రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అపర్ణ రాణి అన్నారు. పాచలవలస అంగన్‌వాడీ–2 కేంద్రంలో కార్యకర్త సుజాత అధ్యక్షతన శనివారం నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారులతో దేశ నాయకుల వేషధారణలు వేయించి బహుమతులు అందజేశారు. అనంతరం జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్‌తో పోలీసులు

దత్తిరాజేరు: తాడేందొరవలస వద్ద ఏడొంపులు గెడ్డ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్.భూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ శనివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మరడాం వద్ద సిబ్బందితో కలిసి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి


సూచనలు చేస్తున్న జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: వచ్చే నెల 9న నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా చూడాలని స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి అన్నారు. స్థానిక సివిల్ కోర్టులో సర్కిల్ పరిధిలోని న్యాయవాదులు, పోలీసులతో శనివారం ఆమె సమావేశమై పలు సూచనలు చేశారు. రాజీకి అవకాశం ఉన్న కేసులు లోక్‌అదాలత్‌కు వచ్చేలా చూడాలన్నారు. ఈ మేరకు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

రూ.38.64 లక్షలతో అంచనా బడ్జెట్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.88,70,443లతో సవరణ బడ్జెట్, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.38,64,440లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టగా.. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామ సచివాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని వివరించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ కొంతమంది అధికారులు గైర్హాజరు అవుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇకపై గైర్హాజరైన అధికారులకు మెమోలు ఇవ్వాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్‌కు సూచించారు.

నియోజకవర్గంలో
రూ.7 కోట్లతో రోడ్ల అభివృద్ధి

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గజపతినగరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గజపతినగరం మండలం లింగాలవలస, తుమికాపల్లి, ముచ్చర్ల, లోగీ గ్రామాలకు, దత్తిరాజేరు మండలం గదబవలస నుంచి ఇంగిలాపల్లి (సుమారు 10.22 కిలోమీటర్ల వరకు) రూ.7.01 కోట్లతో రోడ్లు అభివృద్ధి, మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గజపతినగరం మండలం ఎం.గుమడాం, జామి మండలం అట్టాడ గ్రామాలకు రోడ్లు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి త్వరలోనే అనుమతులు మంజూరు కానున్నట్లు చెప్పారు. ఇప్పటికే మార్కెట్ కమిటీ నిధులు రూ.12.74 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇంతగా అభివృద్ధి జరుగుతున్నా.. తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులకు అభివృద్ధి కనిపించడం లేదని, పచ్చ మీడియా ద్వారా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వారు అధికారం కోసం వెంపర్లాడుతున్నారు తప్ప ప్రజా సంక్షేమం కోసం వారికి ఎలాంటి ఆలోచన లేదని ఎద్దేవా చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై మాట్లాడే అర్హత టీడీపీ, జనసేనకు లేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 175కి 175 సీట్లు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలాల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, కృష్ణార్జున, బొద్దల చిన్నంనాయుడు, జి.రామునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, జేసీఎస్ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకుడు మండల సురేష్, ఇనుమల రాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

• ఆర్డీఓ బి.శాంతి


మెరకముడిదాం: బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ శాంతి

మెరకముడిదాం: ఓటర్ల జాబితాలను తప్పులు లేకుండా రూపొందించడంతో బీఎల్‌ఓలు చిత్తశుద్ధితో పనిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని ఆర్డీఓ బి.శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో మండలంలోని బీఎల్‌ఓలతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా నుంచి మృతులు, పర్మినెంట్ మైగ్రెంట్స్ వివరాలను తొలగించాలని కచ్చితమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ బీఎల్‌ఓల నుంచి సరైన స్పందన లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు నమోదు చేయడంతో పాటు మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు గిరిధర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

లక్కవరపుకోట: 18 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి సూచించారు. తన కార్యాలయంలో బీఎల్‌ఓలతో శనివారం సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి మృతులు, శాశ్వత వలసదారుల వివరాలను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని, జాబితాలో తప్పులు ఉన్నట్లయితే వాటిని సవరించాలని సూచించారు. ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామాజిక తనిఖీలపై ప్రజావేదిక


సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మెరకముడిదాం: మస్టర్లలో వేతనదారుల సంతకాలు, వేలిముద్రలు లేకపోతే ఎలా..అంటూ గర్భాం ఉపాధి ఎఫ్‌ఏపై సామాజిక తనిఖీ ప్రొసీడింగ్ అధికారి, ఏపీడీ వీవీవీఎస్ లక్ష్మణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రత్నం, ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీల నివేదికలను అధికారులు బహిర్గతం చేశారు. ఒకటి రెండు పంచాయతీల్లో తప్ప మిగిలిన అన్ని చోట్ల పనులు, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

కొత్తవలస రైల్వేస్టేషన్‌ను సదర్శించిన జీవీఎల్

కొత్తవలస: మండల కేంద్రంలోని కొత్తవలస రైల్వేస్టేషన్‌ను కోస్ట్ రైల్వే జోనల్ కన్సల్టేటివ్, బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు శనివారం సందర్శించారు. అక్కడి సమస్యలపై ఆరా తీశారు. ఇటీవల అలమండ సమీపంలో జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో సిగ్నల్ వ్యవస్థ పనితీరు, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో కొత్తవలస రైల్వేస్టేషన్‌కు రెండు వైపులా నడక బ్రిడ్జిని నిర్మిస్తామన్నారు. అలాగే రాయడగ–గుంటూరు పాసింజర్‌లతో పాటు మరికొన్ని ముఖ్యమైన రైళ్లు ఈ స్టేషన్‌లో ఆగేలా రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. విశాఖ–కాశీ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

పక్కాగా పంటకోత ప్రయోగాలు


కొత్తవలస: చిన్నిపాలెంలో పంటకోత ప్రయోగంలో దిగుబడి లెక్కిస్తున్న ఏఓ, ఏఎస్‌ఓ, తదితరుల

కొత్తవలస: మండలంలో ఖరీఫ్ పంటకోత ప్రయోగాలు పక్కాగా చేపడుతున్నట్లు ఏఓ మాధురీ శరణ్య అన్నారు. మండలంలోని చిన్నిపాలెంలో శనివారం పంటకోత ప్రయోగాలు చేపట్టారు. 5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెండు ప్రయోగాలు చేపట్టగా.. 12.520 కిలోలు, 15.630 కిలోలు దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. మండలంలో ఇప్పటివరకు 6 పంటకోత ప్రయోగాలు పూర్తిచేసినట్లు చెప్పారు. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ సన్యాసిరావు, వ్యవసాయ సహాయకులు అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

తమటాడలో..

బొండపల్లి: మండలంలోని తమటాడ గ్రామంలో వరి పంటకోత ప్రయోగం శనివారం చేపట్టారు. పీఎం ఫసల్ బీమా వర్తించాలంటే పంటకోత ప్రయోగాలు తప్పనిసరిగా చేయాల్సి ఉన్నందున వీటిని చేపడుతున్నట్లు డివిజనల్ గణాంక అధికారి డి.వేణునాయుడు, ఏఓ పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బీమా ప్రతినిధి రమణ, ఏఈఓ సంతోష్‌కుమార్, వీఏఏ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉపాధి అవకాశం

కొత్తవలస: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ వృత్తివిద్యా కోర్సులను అభ్యసిస్తున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి ఎస్.భీమశంకరరావు సూచించారు. కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. హెచ్‌సీఎల్, టెకీబీ సంస్థలో ఉపాధి అవకాశాలతో పాటు డిగ్రీ విద్యను కూడా పూర్తి చేసుకునేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. ఆ సంస్థ బృందం సభ్యులు ఆయా కళాశాలలను సందర్శించే సమయంలో ప్రిన్సిపాల్స్ సహకరించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9642973350, 7780754278 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు వారిని అభినందిస్తున్నారు.


గుర్ల: మణికంఠను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, తదితరులు


బొండపల్లి: వాలీబాల్‌లో ప్రతిభకనబరిచిన హరిని అభినందిస్తున్న పీడీలు, ఉపాధ్యాయులు


ఎస్.కోట: రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ, ఉపాధ్యాయులు


చీపురుపల్లి: ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


చీపురుపల్లిరూరల్: సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ఖోఖో పోటీలకు..

గుర్ల: మండలంలోని గరికివలస ఉన్నత పాఠశాల విద్యార్థి ఆవాల మణికంఠ అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎన్.శ్రీదేవి శనివారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు చిత్తూరు జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొనున్నట్లు చెప్పారు.

టెన్నీకాయిట్ పోటీలకు..

చీపురుపల్లి రూరల్(గరివిడి): రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు టెన్నీకాయిట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఇటీవల గరివిడిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో ఆర్.మౌనిక, పి.రేణుక, జి.శ్రావణి, ఎం.ప్రవళిక, జి.హైమ, పురుషుల విభాగంలో డి.ధనుష్నాయుడు, ఎస్.విజయ్‌కుమార్, డి.ఉపేంద్ర, ఎస్.రాహుల్, కె.జశ్వంత్ ఎంపికైనట్లు చెప్పారు. వారంతా శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వాలీబాల్‌లో గొట్లాం విద్యార్థి సత్తా..

బొండపల్లి: మండలంలోని గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి బైరెడ్డి హరి అండర్–19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 6 నుంచి 8 వరకు తిరుపతిలో జరిగిన పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచినట్లు పీడీలు యు.సత్యానంద్, ఎల్.వి.రమణ తెలిపారు.

రగ్బీ పోటీలకు..

బొండపల్లి: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు రాచకిండాం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం టి.సన్యాసిరాజు శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్–14 విభాగంలో 6గురు, అండర్–17 విభాగంలో 6గురు చొప్పున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరంతా ఈ నెల 22 నుంచి కర్నూలులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు పెద్దింటి రాజేష్, చుక్క పావని అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు ఎంపిక

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.ఆదిలక్ష్మి, ప్రథమ సంవత్సరం చదువుతున్న నిఖిత కుమారీ సింగ్ ఇంటర్ యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించే కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16న విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ వర్సిటీ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో నిర్వహించే ఇంటర్ వర్సిటీ పోటీలకు ఎంపికైయ్యారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి అవంతీ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న కె.కీర్తి సౌత్‌జోన్ స్థాయిలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ మహిళా వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 16, 17 తేదీల్లో గరివిడి అవంతీ కళాశాలలో జరిగిన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో కీర్తి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో వచ్చే నెల 8 నుంచి 12 వరకు తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు అర్హత సాధించింది.

మంత్రి బొత్స ఆరోగ్యం కోసం పూజలు


వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజల్లోనికి రావాలని ఆకాంక్షిస్తూ గరివిడి వైఎస్సార్‌సీపీ నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణ హైదరాబాద్‌లో గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు ఆధ్వర్యంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, ఎలకల అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ రఘుమండ శ్రీదేవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సనాతన సంస్కృతి విశిష్టతను తెలుసుకోవాలి


ప్రవచనాలు బోధిస్తున్న శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి

కొత్తవలస: మన జీవన విధానంలో సనాతన సాంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతలను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సమతానంద దుర్గా మహాపీఠం ఉత్తర పీఠాధిపతులు శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి అన్నారు. మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డులో ఉన్న శ్రీరామా కళ్యాణ మండపంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు సమరసత ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి ఒక్కరూ సేవా భావం, దైవభక్తి కలిగి ఉండాన్నారు. ఆధునిక పోకడలకు పోయి ఎంతో పవిత్రమైన హిందూ సాంప్రదాయాన్ని కొందరు అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం భజన, పండర భజన, తప్పెటగుళ్లు, కోలాటం, గరిడి, ఎరుకుల పాట, డబ్బు కళాకారులు, తదితర కళాకారులతో కలిసి కొత్తవలస జంక్షన్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు జాగారపు కృష్ణ, సుంకరి లక్ష్మి, కొరుపోలు అప్పారావు, ద్వారపూడి సత్యారావు, ఏడువాక మణికంఠ, పాలమరశెట్టి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, తదితరులు

గజపతినగరం: సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా సహకార సంఘాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ వాణి శైలజ, పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ అన్నారు. స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో శనివారం వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంఘాల బలోపేతానికి, రైతులకు మెరుగైన సేవలందించేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. సమష్టి కృషితోనే సంఘాల బలోపేతం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, సీఈఓ నారాయణరావు, డైరెక్టర్ బోని సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

జామి: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పౌరసరఫరాల శాఖ సిబ్బందికి, వ్యవసాయ సహాయకులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం తేమశాతం గుర్తింపు, యాప్ వినియోగం, కొనుగోలు, తరలింపు, జియో ట్రాకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హమాలీ చార్జీలు, గన్నీ బ్యాగ్‌లు, రవాణా ఖర్చులను వారం రోజుల్లోగా రైతులకు చెల్లించనున్నట్లు ఏఓ తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

వేపాడ: మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రుణాలు కావాల్సిన వారికి ఐకేపీ ద్వారా మంజూరు చేస్తామని, నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు.

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం–5 పరిధి రాజుపాత్రునిపాలెం సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో ఎంపీడీఓ వై.పద్మజ ఆధ్వర్యంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. నిర్మాణాలు వేగవంతం చేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులకు అన్ని విధాలా సహకరించాలని ఇంజినీరింగ్, హౌసింగ్, సచివాలయ సిబ్బందికి సూచించారు. హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి

కొత్తవలస: కొత్తవలస మండల కేంద్రాన్ని కాలుష్యం కోరల నుంచి రక్షించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, గాడి అప్పారావు మాట్లాడుతూ.. కొత్తవలస మీదగా వందలాది భారీ లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని, దుమ్ము, ధూళి ఎగసిపడుతున్నాయని, ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి భారీ వాహనాలను నియంత్రించాలని, రోడ్లు బాగుచేయాలని కోరారు.

వికాస్ ధనవృద్ధితో అధిక వడ్డీ

వేపాడ: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకులో వికాస్ ధనవృద్ధి పథకంలో డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ చెల్లిస్తామని వేపాడ ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ కె.జనార్దన్ అన్నారు. శనివారం బ్రాంచిలో నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై అధిక వడ్డీ చెల్లించనున్నట్లు చెప్పారు. వికాస్ ధనవృద్ధిలో 7.50శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 8శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలను తక్కువ వడ్డీకి ఇస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాల బడ్జెట్‌పై హెచ్‌ఎంలకు శిక్షణ

కొత్తవలస: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి సబంధించి పాఠశాలల నిర్వహణ బడ్జెట్ రూపకల్పనపై హెచ్‌ఎంలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాఠశాలల్లో బోధన, వసతులు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి బడ్జెట్‌ను ఏవిధంగా తయారు చేయాలో వివరించారు. అలాగే ఆయా పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

నర్సిపల్లి మెట్ట సందర్శించిన ఎంపీడీఓ

వేపాడ: మండలంలో సోంపురం పంచాయితీ నర్సిపల్లి మెట్టను ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్ శనివారం సందర్శించారు. నర్సిపల్లి మెట్టవద్ద నివసిస్తున్న వలస కుటుంబాలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. వారి రేషన్, ఆధార్ కార్డులను పరిశీలించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు అర్హులను గుర్తించారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కన్వర్జెన్సీ సమావేశం

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల కన్వర్జెన్సీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారుల పనితీరు, ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

వేపాడ: నాడు–నేడు పనులు త్వరితగతిని పూర్తిచేయాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో శనివారం హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. స్కూల్ డవలెప్‌మెంట్, హెబిటేషన్, రిక్రూట్‌మెంట్, టెస్ట్ బుక్స్, వర్క్ బుక్స్, నోట్స్ బుక్స్, సిలబస్ ప్రకార తరగతులు నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షించారు.